క్లుప్తంగా

కాశిరెడ్డికుంటలో ఆక్రమణల పరిశీలన


కుంట స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కాశిరెడ్డికుంటలో అక్రమ కట్టడాలను గురువారం నగర పంచాయతీ కమిషనర్ డి.వెంకటదాసు పరిశీలించారు. కుంట స్థలం ఆక్రమణలపై గతంలో జారీ చేసిన నోటీసులను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కుంట ఆక్రమణలను పరిశీలిస్తున్నామని, ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేస్తామని చెప్పారు. కుంట అభివృద్ధిపై ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు చెప్పారు. కుంట స్థలంలో రామకృష్ణ ధ్యాన మందిరం, గాయత్రిమాత ఆలయం ఉన్నందున, వాటి తొలగింపు మతపరమైన అంశంతో ముడిపడినందున ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించేందుకు ప్రయత్నించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు.

29న రెవెన్యూ అసోసియేషన్ ఎన్నికలు

మార్కాపురం: ఈనెల 29వ తేదీన మార్కాపురం రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి, ఏపీఆర్ఎస్ఏ జిల్లా ఉపాధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు తెలిపారు. అధ్యక్షుడు, అసోసియేట్ ప్రెసిడెంట్, ముగ్గురు వైస్ ప్రెసిడెంట్లు, సెక్రటరీ, ముగ్గురు సహాయ కార్యదర్శులు, కోశాధికారి, ఇద్దరు ఈసీ మెంబర్లను ఎన్నుకోనున్నట్లు వివరించారు. ఈనెల 24న మార్కాపురంలోని రెవెన్యూ భవన్‌లో నామినేషన్లు స్వీకరిస్తామని, 29న ఎన్‌జీఓ హోంలో ఎన్నికలు నిర్వహించి అదే రోజు ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పోటీ చేయాలని గురువారం ఓ ప్రకటనలో సూచించారు.

అంగన్‌వాడీల్లో చిన్నారులకు సమగ్ర విద్య


మాట్లాడుతున్న ఎంఈవో రాందాస్‌నాయక్

మార్కాపురం టౌన్: చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో సమగ్ర విద్య అందిస్తున్నట్లు ఎంఈవో రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆర్పీలకు మూడు రోజుల శిక్షణను కోర్సు డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న ఎంఈఓ ప్రారంభించి మాట్లాడారు. మూడు నుంచి ఆరేళ్ల పిల్లల సమగ్ర అభివృద్ధికి సంబంధించిన ఐదు డొమైన్స్‌పై మెళకువలు, ప్రాథమిక అంశాలను అందించి వారిని బలోపేతం చేయడం ద్వారా ప్రాథమిక స్థాయికి పిల్లలను సిద్ధపరిచేందుకు అవకాశం ఉంటుందన్నారు. డీవైఈవో శామ్యూల్ మాట్లాడుతూ.. శిక్షణ అంతిమ లక్ష్యాలను పొందడానికి ఆర్పీలు క్షేత్ర స్థాయిలో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆర్పీలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గిద్దలూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని ముండ్లపాడు సమీపంలో పెట్రోల్ బంకు వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. మండలంలోని బురుజుపల్లెకు చెందిన ఎస్.రవి తన బైక్‌పై గిద్దలూరు నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. అదే సమయంలో పెట్రోల్ బంకులోకి వెళ్తున్న ఆటో.. బైక్ ఢీకొన్నాయి. ఆటో డ్రైవర్ 108కు సమాచారం అందించడంతో గాయపడిన రవిని గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

పచ్చ నేతలదే పెత్తనం

- సర్పంచ్ హక్కులను కాలరాస్తున్న కూటమి ప్రభుత్వం
- గ్రామ ప్రథమ పౌరులను డమ్మీలుగా మార్చేసిన వైనం
- పంచాయతీ తీర్మానం లేకుండానే గ్రామాల్లో పనులు
- ఇష్టారీతిగా పనులు చేస్తుండటంపై సర్పంచ్‌ల ఆగ్రహం


అక్కచెరువులో సైడు కాలువలు లేకుండా వేసిన సిమెంట్ రోడ్డు

పొదిలి రూరల్:

గ్రామ పంచాయతీల్లో సర్పంచ్‌ల డమ్మీలుగా మార్చి, వారి హక్కులు, అధికారాన్ని కూటమి ప్రభుత్వం కాలరాస్తోంది. గ్రామ ప్రథమ పౌరుడైన సర్పంచ్ సంతకానికి ఎంతో ప్రాధాన్యత ఉంటుంది. గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేయాలన్నా తప్పనిసరిగా పంచాయతీ తీర్మానం చేశాకే పనులు ప్రారంభించాల్సి ఉంటుంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్పంచ్‌ల అధికారాలకు చెక్ పెడుతున్నారే విమర్శలు వినిపిస్తున్నాయి. రాజ్యాంగబద్ధంగా ప్రజలతో ఎన్నుకోబడిన సర్పంచ్‌లను గ్రామ పరిపాలనతో సంబంధం లేకుండా కూటమి ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టింది. పొదిలి మండలంలోని 16 పంచాయతీల్లో జాతీయ గ్రామీణా ఉపాధి హామీ పథకం కింద 6.3 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు నిర్మించేందుకు రూ.2.65 కోట్లు కేటాయించారు. అయితే ఈ పనుల గుర్తింపు మొత్తం కూటమి నాయకుల కనుసన్నల్లోనే సాగిందనేది ప్రధాన ఆరోపణ. సర్పంచ్‌ల ప్రమేయం లేకుండానే పనులు ఎంపిక చేసి, గత రెండు రోజులుగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, అధికారులు సమన్వయంతో పని చేయాలని అధికారులు ఉపన్యాసాలు ఇచ్చారు. కానీ ఆ ప్రసంగాలు కేవలం మాటలకే పరిమితమయ్యాయి. గ్రామాభివృద్ధిలో పంచాయతీ వ్యవస్థను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు కుట్రలకు తెరలేపిందని సర్పంచ్‌లు ఆందోళన చెందుతున్నారు. ఎక్కువ శాతం మంది వైఎస్సార్‌సీపీ మద్దతుదారులమే సర్పంచ్‌లుగా ఉండటంతో కూటమి నాయకులు చెప్పినట్లు అధికారులు నడుచుకుంటున్నారని వారు ఆరోపిస్తున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా పనులు

గ్రామాల్లో పనులు చేపట్టాలంటే సర్పంచ్ అధ్యక్షతన వార్డు సభ్యులు సమావేశమై అందరి అభిప్రాయం తెలుసుకోవాలి. మెజార్టీ సభ్యుల అంగీకారంతో పనులకు శ్రీకారం చుట్టాలి. కానీ కూటమి నాయకులు అందుకు విరుద్ధంగా పెత్తనం చేయాలని చూస్తున్నారు. పొదిలి మండలంలో మొత్తం 16 పంచాయతీల్లో 6.3 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్ల నిర్మాణానికి రూ.2.65 కోట్ల నిధులు మంజూరు చేశారు. ఆయా పంచాయతీలకు నిధులు కేటాయించారు కానీ గ్రామ సర్పంచ్‌లకు కనీస సమాచారం ఇవ్వకుండా, తీర్మానాలు లేకుండా పనులు చేయడం ఏమిటని నిలదీస్తున్నారు. అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు సంబంధిత అధికారులు నడుచుకుంటూ, తమను చిన్న చూపు చూడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

నిధుల కేటాయింపులో వివక్ష

మండలంలోని 16 పంచాయతీల్లో మూగచింతల, ఓబులక్కపల్లి, ఏలూరు, ఉప్పలపాడు, తలమళ్ల, ఆముదాలపల్లి, మల్లవరం, జువ్వలేరు, అక్కచెరువు, తుమ్మగుంట, రామాపురం, పాములపాడులో 12 మంది వైఎస్సార్ సీపీ మద్దతు సర్పంచ్‌లు ఉన్నారు. అన్నవరం, కుంచేపల్లి, ఈగలపాడు, కొండాయపాలెం పంచాయతీల్లో టీడీపీకి చెందిన నలుగురు సర్పంచ్‌లుగా కొనసాగుతున్నారు. పొదిలి మండలంలో ఇప్పటికే కొన్ని గ్రామాల్లో పనులు ప్రారంభించగా, మరి కొన్ని చోట్ల ఇంకా మొదలుపెట్టాల్సి ఉంది. అయితే వీటిలో టీడీపీ సర్పంచ్‌లు ఉన్న పంచాయతీలకు ఎక్కువ నిధులు, వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు ఉన్న దగ్గర తక్కువ నిధులు కేటాయించి ఆయా గ్రామాలపై వివక్ష చూపారన్న విమర్శలు వెల్లువెత్తాయి.

గ్రామాల్లో నిధుల కేటాయింపు ఇలా..

పంచాయతీ పేరు	మంజూరు చేసిన నిధులు(రూ.లక్షల్లో)
అక్కచెరువు	20
జువ్వలేరు	12
మల్లవరం	11
సూదనగుంట	20
తుమ్మగుంట	07
తలమళ్ల	25
ఏలూరు	15
ఓబులక్కపల్లి	7
ఉప్పలపాడు	13
ఆముదాలల్లి	15
పాములపాడు	10
మూగచింతల	10
ఈగలపాడు	30
అన్నవరం	15
కొండాయపాలెం	30
కుంచేపల్లి	25
మొత్తం	రూ.2.65 కోట్లు

అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు


అనిల్ దంపతులను సత్కరిస్తున్న గురుస్వాములు

పొదిలి: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గురుస్వాములు శబరిమల తరలి వెళ్తున్న సందర్భంగా యక్కలి శేషగిరిరావు ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు. శ్రీలక్ష్మీ పద్మావతి వెంకటేశ్వర స్వామి ఆలయ ఉభయదాతలు వరికుంట్ల అనిల్, ధర్మపత్ని సురేఖ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం గురుస్వాముల ఆధ్వర్యంలో అనిల్ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ పూజారులు మురళీ కృష్ణమాచార్యులు, వాసు, అప్పల శంకర్, పునుగుపాటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మానవత సంస్థ డైరెక్టర్ కల్లం సుబ్బారెడ్డి జన్మదినం సందర్భంగా స్థానిక గోశాలలో సుబ్బారెడ్డి, నిర్మల దంపతులు ఆవులకు నవధాన్యాలు, కూరగాయలు ఆహారంగా అందించారు.

31లోగా పంటల బీమా చేయించుకోవాలి

బేస్తవారిపేట: పంటల బీమా గడువును ఈ నెల 31వ తేదీ వరకు పెంచినట్లు వ్యవసాయాధికారి జక్కం మెర్సీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమాకు తగిన రుసుం చెల్లించాలని రైతులకు సూచించారు. ప్రకృతి విపత్తుల కారణంగా పంట నష్టం సంభవిస్తే ప్రభుత్వం నుంచి పరిహారం పొందేందుకు బీమా దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఘనంగా యూత్ క్రిస్మస్ వేడుకలు



మాట్లాడుతున్న పాల్ ఇమ్మానియేల్



సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌లో తెలుగు బాపిస్టు టౌన్ చర్చిలో గురువారం ఘనంగా యూత్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన విజయవాడకు చెందిన డాక్టర్ పాల్ ఇమ్మానియేల్ మాట్లాడుతూ.. క్రిస్మస్ పర్వదినాన్ని ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో ఘనంగా నిర్వహించుకుంటారన్నారు. యువత సన్మార్గంలో నడవాలని, దేవుడు చెప్పిన ఆజ్ఞలను పాటించాలన్నారు. ఈ సందర్భంగా యువత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. చర్చి కమిటీ సభ్యులు క్రిస్మస్ కేక్ కట్ చేసి, క్యాండిల్ లైట్ సర్వీసు నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ డైరెక్టర్ డి.సౌమ్య, చర్చి అధ్యక్షుడు శామ్యూల్, ఉపాధ్యక్షుడు ఆర్డర్, కార్యదర్శి జయరావు, కోశాధికారి రామస్వామి, చర్చి పాస్టర్ అమృత్‌తేజ్, యూత్ సభ్యులు వి.శ్యాంప్రకాష్, విజయకుమార్, డి.బాబి, సత్య ప్రవంతి, హర్షిత, లీనాగ్రేస్, రాజ్‌కమల్, సాగర్, డెన్నిస్ తదితరులు పాల్గొన్నారు.

గోదాదేవికి గోవింద స్వాముల అభిషేకం

పొదిలి: స్థానిక శ్రావణి ఎస్టేట్‌లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవికి అభిషేకాలు వైభవంగా సాగుతున్నాయి. గురువారం ఉభయదాతలుగా వ్యవహరించిన గోవింద స్వాములతో ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అమ్మవారికి అభిషేకాలు చేశారు. ముందుగా ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యక్కలి శేషగిరిరావు, శ్రావణి వెంకటేశ్వర్లు, ఎస్.నాగేశ్వరరావు, సాయి, రవి తదితరులు పాల్గొన్నారు.


ప్రదక్షిణ చేస్తున్న గోవింద స్వాములు

రెవెన్యూ గ్రామ సభకు 8 అర్జీలు

కంభం: రైతులు భూ సమస్యలపై రెవెన్యూ గ్రామ సభల్లో అర్జీలు సమర్పించాలని తహసీల్దార్ వి.కిరణ్ సూచించారు. మండలంలోని పెద్దనల్లకాల్వ గ్రామంలో గురువారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభలో వచ్చిన 8 అర్జీలను పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీటీ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు మండలంలో..

గిద్దలూరు రూరల్: మండలంలోని ఓబులాపురం గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సభకు 14 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి తెలిపారు. గ్రామ సభలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీటీ నాయబ్, ఆర్ఐ భాస్కర్‌రావు, వీఆర్‌ఓలు, సర్వేయర్ పాల్గొన్నారు.

కంభం బస్టాండ్ సమీపంలో బైక్ చోరీ

కంభం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మసీదు వద్ద గురువారం నిలిపి ఉంచిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తి అపహరించాడు. అబ్దుల్ కరీం అనే వ్యక్తి సాయంత్రం మసీదులో ప్రార్థనకు వెళ్తూ తన హోండా షైన్ (ఎపి27ఎజెడ్ 3637) బైక్‌ను బయట ఉంచాడు. ప్రార్థన ముగించుకుని వచ్చే సరికి అక్కడ బైక్ కనిపించలేదు. ఓ వ్యక్తి బైక్ తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీ ఫుటేజ్‌లో నిక్షిప్తమయ్యాయి. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపాడు.


బైక్ చోరీ చేస్తున్న వ్యక్తి (సీసీ ఫుటేజ్ దృశ్యం)

యువ కళాకారులను ఆదరించండి

- త్రిఘర్షణ షార్ట్ ఫిలిం బృందం విజ్ఞప్తి


మాట్లాడుతున్న యువ కళాకారులు

పొదిలి: త్రిఘర్షణ షార్ట్ ఫిలింను ఆదరించడం ద్వారా స్థానిక యువ కళాకారులను ప్రోత్సహించాలని చిత్ర బృందం కోరింది. షార్ట్ ఫిలిం శుక్రవారం విడుదలవుతున్న నేపథ్యంలో గురువారం సాయంత్రం మీడియా సమావేశంలో బృంద సభ్యులు మాట్లాడారు. ముగ్గురు యువకులు తమ లక్ష్యాలను చేరుకునే క్రమంలో ఎదుర్కొన్న సంఘటనల ఇతివృత్తంగా షార్ట్ ఫిలిం తెరకెక్కించినట్లు వివరించారు. ఫిలిం చిత్రీకరణకు తమ స్నేహితులు అందించిన సహాయ సహకారాలు మరువలేనివన్నారు. యూట్యూబ్‌లో అసిఫ్ చానెల్‌లో చిత్రాన్ని తిలకించి ఆదరించాలని కోరారు. సమావేశంలో నటుడు, దర్శకుడు అసిఫ్, మణికంఠ, మధు, మ్యూజిక్ కంపోజర్ కెన్నీ, కిరణ్మయి, వినోద్‌రాజ్, అమీన్, చిన్ననాటి స్నేహితుల బృందం సభ్యులు రఫీ, యాసిన్, రసూల్, అశోక్ బండి, రోటి యస్దాన్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి కూలీలకు యమా డిమాండ్!

- సీజన్ కావడంతో గ్రామాల్లో కూలీల కొరత
- మేస్త్రీల సాయంతో పట్టణాల నుంచి కూలీలను రప్పిస్తున్న రైతులు
- ఒక్కొక్కరికి రోజుకు రూ.300 కూలి చెల్లింపు


మిరపకాయలు కోసేందుకు వెళ్తున్న కూలీలు

మార్కాపురం: మిర్చి కోతలు ప్రారంభం కావడంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. రోజుకు రూ.250 నుంచి రూ.300 వరకు కూలి ఇస్తున్నప్పటికీ సీజన్ కావడంతో కూలీలు సరిపడినంత మంది లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎకరాకు సుమారు 10 నుంచి 12 మంది వరకు కూలీలు అవసరం కాగా చుట్టుపక్కల గ్రామాలతోపాటు మార్కాపురం పట్టణం నుంచీ కూలీలను రప్పించి మిర్చి కోతలు ముమ్మరంగా చేశారు. మార్కాపురం మండలంలోని జమ్మనపల్లి, కోలభీమునిపాడు, నికరంపల్లి, చింతగుంట్ల, వేములకోట, తిప్పాయిపాలెం, బిరుదులనరవ, కొత్తపల్లి, మిట్టమీదిపల్లి, రాయవరం, దరిమడుగు, గజ్జలకొండ, తర్లుపాడు మండలంలోని సీతానాగులవరం, తర్లుపాడు, మీర్జపేట, తాడివారిపల్లి, లక్ష్మక్కపల్లి, పోతలపాడు, గానుగపెంట, కలుజువ్వలపాడు, తుమ్మలచెరువు, జగన్నాథపురం, మంగళకుంట, ఓబాయపల్లి, పెద్దారవీడు మండలంలోని కలనూతల, గుండంచర్ల, కెకొత్తపల్లి, దేవరాజుగట్టు, చెర్లోపల్లి, పెద్దారవీడు తదితర గ్రామాల్లో మిర్చి సాగు ఎక్కువగా ఉంది. గత పది రోజులుగా పండు మిర్చి కోతలు సాగుతున్నాయి. మరోవైపు అల్పపీడన ప్రభావంతో గత నాలుగు రోజుల నుంచి చిరుజల్లులు పడుతుండటంతో ఆందోళన చెందుతున్న మిర్చి రైతులు త్వరగా మొదటి విడత మిర్చి కోతలు పూర్తి చేయాలని హైరానా పడుతున్నారు. సొంత గ్రామాల్లో కూలీల కొరత ఏర్పడటంతో మేస్త్రీల సాయంతో మార్కాపురం పట్టణంలో కూలీలను పనులకు తీసుకెళ్తున్నారు. రోజూ వాహనాల్లో ఉదయం 6 గంటలకే పొలాలకు తీసుకెళ్లి మధ్యాహ్న సమయంలో ఇళ్ల వద్ద వదిలిపెడుతున్నారు. వారికి కూలితోపాటు కొన్ని మిరపకాయలు కూడా నజరానాగా ఇస్తున్నారు. ఈ ఏడాది మార్కాపురం మండలంలో 2500 ఎకరాలు, తర్లుపాడు మండలంలో 60 ఎకరాలు, పెద్దారవీడు మండలంలో 1079 ఎకరాల్లో మిర్చిని రైతులు సాగుచేశారు. కొంత మంది రైతులు ఎకరా మిర్చి కోస్తే కాంట్రాక్టు కింద కూలి చెల్లిస్తున్నారు. రోజు వారీ అయితే ఎక్కువ మొత్తంలో కూలి ఖర్చులు భరించాల్సి వస్తోందని గ్రహించిన రైతులు మేస్త్రీకి ఎకరాకు రూ.4 వేల నుంచి రూ.5 వేలు కాంట్రాక్టు కింద ఇస్తున్నారు. మార్చి నెలాఖరు వరకూ మిర్చి కోతలు సాగనున్నాయి. ప్రస్తుతం మొదటి విడత కోత కావడం, అల్పపీడనం నేపథ్యంలో కూలీలకు భారీగా డిమాండ్ ఏర్పడిందని రైతులు పేర్కొంటున్నారు.